క్లుప్తంగా

వినాయక ప్రతిమల ప్రదర్శన



ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలతో ఎస్‌కేఆర్ విద్యార్థినులు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మీ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమల ప్రదర్శన శనివారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ వినాయక చవితిలో ఉపయోగించే 21 వినాయక పత్రి, దాని ఉపయోగాలను వివరించారు. విద్యార్థినులు మట్టి, పసుపు, గోధుమపిండి, రావి చెట్టు పత్రాలు, ఆవాలు, మెంతులు బంతినారు, ధనియాలు, మిరియాలు, తులసి విత్తనాలు వేసి ఎకో ఫ్రెండ్లీ గణపతి ప్రతిమలు తయారు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీదేవి, అధ్యాపకులు పి.శ్రీదేవి, టి.నాగముని, బి.ఆశాలత పాల్గొన్నారు.

ప్రకాశంనగర్: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్‌వీ సత్యనారాయణ, ట్రస్ట్ అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రాజబాబు పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా నిర్వహించాలి

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సమగ్రంగా సర్వే నిర్వహించాలని స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నరేష్ ఆదేశించారు. శనివారం దుళ్లలో జగనన్న సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ఆరా తీశారు. డాక్టర్ జెస్సీ సుప్రియ వివరాలను తెలిపారు. నరేష్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. వైద్య సిబ్బంది అలీబేగ్, ఐశ్వర్య, వినీత, ముత్యాలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య కో ఆర్డినేటర్‌గా 'వేదాంతం'



వేదాంతం రాంబాబు

కడియం: జిల్లా అర్చక సమాఖ్య కో ఆర్డినేటర్‌గా వేమగిరికి చెందిన వేదాంతం రాంబాబు నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు స్థానిక విలేకరులకు ఆయన వివరాలు తెలిపారు. తన నియామకానికి సంబంధించి దేవదాయ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఆయన్ని గాయిత్రీ బ్రాహ్మణ సంఘం సభ్యులు అభినందించారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కంబాలచెరువు: రాష్ట్రంలో ఇంటర్ ప్రవేశపెట్టిన హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. శనివారం స్థానిక నగర శాఖ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా సర్వీస్ రూల్స్, కోర్టు కేసుల పేరుతో భర్తీ కాని డివిజనల్ స్థాయి ఉప విద్యాశాఖ అధికారి పోస్టులను అర్హులైన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు, ప్రధాన కార్యదర్శి మంగిన రామారావు, కోశాధికారి గణపతిరావు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఒకరిని, యానాం మద్యం తీసుకువస్తున్న మరొకరిని అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమూరు పప్పులవారి వీధికి చెందిన మారిశెట్టి దుర్గారావును అరెస్టు చేసి అతని నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఆర్యాపురానికి చెందిన బర్ల సతీష్ యానాం నుంచి మద్యం తీసుకు వస్తుండగా సీతంపేట వద్ద సిబ్బందికి చిక్కాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



ప్రకాష్‌రాజ్ (ఫైల్)

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానిక ఆవ రోడ్డులోని విద్యానగర్‌కు చెందిన ప్రకాష్‌రాజ్ బైపాస్ రోడ్డులోని ఓ స్కూల్‌లో చదువుతున్నాడు. శుక్రవారం స్కూల్ నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా రామకృష్ణ థియేటర్ వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆ బాలుడిని దగ్గర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్, ఆ సంస్థ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బాలుడి కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు.

కళారూపం... అద్భుతం

- భక్తిభావం ఉట్టిపడేలా విగ్రహాల తయారీ
- రాజస్థానీ కళాకారుల నైపుణ్యం
- నగర కేంద్రంగా విగ్రహాల విక్రయం



రాజమహేంద్రవరంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న గణనాథుని విగ్రహాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆ కళ అపురూపం.. అద్భుతం. జీవం ఉట్టిపడేలా దేవతా మూర్తుల విగ్రహాల తయారీలో వారిది అందెవేసిన చేయి.. బొమ్మను చేసి రంగులద్ది, ఆకట్టుకునేలా హస్తకళా నైపుణ్యంతో తీర్చిదిద్దడంలో వారికి వారే సాటి. రాజస్థానీ కళాకారుల చేతితో రాముడైనా, కృష్ణుడైనా, శివుడైనా, వినాయకుడైనా ఎంతో అపురూపంగా రూపుదిద్దుకుంటారు. ఏడాదిలో ఆరు నెలలు ఈ విగ్రహాల తయారీలో ఆ కుటుంబాలు నిమగ్నమవుతుంటాయి. జీవం ఉట్టిపడే విధంగా ప్రతిమలను వైట్ సిమెంట్‌తో తయారీ చేస్తున్నారు. బొజ్జ గణపయ్య, రాధాకృష్ణులు, పిల్లన గ్రోవితో గోపాలుడు, రామచిలుకలు, ఏనుగులు ఇలా ఎన్నో కళా రూపాలను రోడ్డు పక్కనే అలవోకగా తయారు చేస్తున్నారు.

రాజస్తాన్ నుంచి ఇక్కడకు..

రాజస్తాన్ నుంచి పొట్ట చేతపట్టుకుని తూర్పు గోదావరి జిల్లాకు చేరుకుని ఇక్కడే జీవనం సాగిస్తున్నారు ఈ కళాకారులు. రాజమహేంద్రవరం కేంద్రంగా లాలాచెరువు, ఆర్‌టీఓ కార్యాలయం వద్ద వీరు బొమ్మలు తయారీకి స్థలం లీజుకు తీసుకుని అక్కడ షెడ్లు వేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక్కడే కాకుండా బొమ్మూరు, హుకుంపేట, ధవళేశ్వరం వద్ద కూడా రోడ్లపై విగ్రహాలు తయారీ చేస్తున్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఆరు నెలల ముందు నుంచే గణపతి విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. అడుగు నుంచి తొమ్మిది అడుగుల విగ్రహాల వరకూ వివిధ ఆకృతులలో వినాయకుడిని తయారు చేసి విక్రయిస్తారు. సైజును బట్టి ఒక్కో విగ్రహానికి మూడు రోజుల నుంచి వారం రోజుల వరకూ సమయం పడుతుంది. అలాగే సైజు, డిజైన్ బట్టి రూ.3 వేల నుంచి రూ.75 వేల వరకూ ధరలు ఉంటాయి. ఇంటిల్లపాదీ బొమ్మల తయారీతో ఉపాధి పొందుతున్నారు. జీవం ఉట్టిపడేలా బొమ్మలు తయారు చేయడం వారికీ వారసత్వంగా అబ్బిన విద్య. తమ పూర్వీకులు మట్టితో బొమ్మలు తయారు చేసేవారని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం వైట్ సిమెంట్‌తో బొమ్మలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు.



వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

శ్రీ గణేశా.. జై గణేశా..

వినాయక నవరాత్ర ఉత్సవాలకు సమయం దగ్గర పడింది. రాజస్థానీ కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న బొజ్జ గణపయ్య విగ్రహాలనే ఉత్సవ మండపాల్లో నిలపడం విశేషం. వినాయక చవితి వేడుకల కోసం గణనాథుని విగ్రహాల తయారీకి వీరు ప్రాధాన్యం ఇస్తారు. ముందుగా వైట్‌సెమ్ మిశ్రమాన్ని పేస్టులా తయారు చేసి ఆయా రకాల ఆకృతులలో ఉన్న రబ్బరు ఫ్రేముల్లో ఈ మిశ్రమాన్ని పోస్తారు. కొద్దిసేపటి తరువాత ఆ రబ్బరు ఫ్రేమ్‌ల నుంచి తొలగించి బొమ్మలను ఎండలో ఆరపెడతారు. అవి గట్టిపడ్డాక బొమ్మను బట్టి అవసరమైన రంగులను అద్దుతారు. వినాయక చవితి వేడుకలు ముగిసిన అనంతరం ఇళ్లకు శోభను తీసుకువచ్చే అలంకరణ బొమ్మల తయారీలో నిమగ్నమవుతుంటారు. వీటిని రోడ్ల పక్కనే విక్రయిస్తుంటారు.

కుటుంబమంతా బొమ్మల తయారీ

"మేము మొత్తం ఏడుగురు కుటుంబ సభ్యులం. రాజస్థానీ నుంచి ఇక్కడకు వచ్చి 15 ఏళ్లు అయ్యింది. వినాయక చవితికి విగ్రహాలు తయారీ చేసి వాటిని విక్రయిస్తాం. ఈ పనిలో మా కుటుంబం మొత్తం నిమగ్నమవుతుంటుంది. ఈ సీజన్‌లో 100 చిన్న విగ్రహాలు, 50 పెద్ద విగ్రహాల వరకూ తయారు చేస్తుంటాం.

– హిమ్మత్, రాజస్థానీ కళాకారుడు

ఆరు నెలలు బిజీగా..




జిల్లాలో గణేశ ఉత్సవాలు బాగా జరుపుతారు. చుట్టుపక్కల ఊర్లు నుంచి ఇక్కడికి వచ్చి ట్రాక్టర్లు, వ్యాన్‌లలో కొనుగోలు చేసి విగ్రహాలు తీసుకెళ్తారు. చాలా వరకూ ముందుగా ఆర్డర్లు తీసుకుని విగ్రహాలు తయారు చేస్తాం. మరికొంత మంది రెండు రోజుల ముందు వచ్చి కొనుగోలు చేస్తారు. ఈ ఆరు నెలలు మాకు చాలా బిజీగా ఉంటుంది. రాత్రి, పగలు కూడా విగ్రహాలు తయారు చేస్తుంటాం."

– రోషన్, రాజస్థానీ కళాకారుడు



బాల గణపతి



ఆకట్టుకునేలా స్వామి రూపం

ఆత్మీయ స్వాగతం

కడియం: వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా నిడదవోలుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలుకుతున్న ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, విజయలక్ష్మి, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, నగర, రూరల్ పార్టీ కో ఆర్డినేటర్లు గూడూరి శ్రీనివాసరావు, చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్‌పర్సన్ ఎం.షర్మిలారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గిరజాల వీర్రాజు, రావిపాటి రామచంద్రరావు





















'బొజ్జా' సేవలు స్ఫూర్తిదాయకం



బొజ్జా తారకం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: నిరంతరం పేద, బడుగు, దళిత, ఆదివాసీ వర్గాలకు సేవలు అందించిన హైకోర్టు సీనియర్ న్యాయవాది దివంగత బొజ్జా తారకం స్ఫూర్తిదాయకులని జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జె.సత్యప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ ఆధ్వర్యంలో బొజ్జా తారకం ఏడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కారంచేడు, లక్ష్మీపురం, చుండూరు వంటి ఘటనల్లో దళితుల పక్షాన నిలబడి అగ్రవర్ణాల చేతుల్లో వివక్షకు గురైన వారికి న్యాయం జరిగి, దోషులకు శిక్ష పడేలా చేయడానికి ఎంతో శ్రమించారన్నారు. పేదలకు ఎక్కడ అన్యాయం జరిగినా న్యాయస్థానాల ద్వారా న్యాయం అందేలా కృషి చేసిన ఘనత తారకానికి దక్కుతుందన్నారు. సమావేశంలో న్యాయవాది సత్యనారాయణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కడియం: రచయితగా, న్యాయవాదిగా, హక్కుల పోరాట యోధుడిగా బొజ్జా తారకం అందించిన సేవలు ఎనలేనివని పలువురు అన్నారు. తారకం వర్ధంతి సందర్భంగా పొట్టిలంక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రిపబ్లికన్ పార్టీ నాయకుడు నక్కా వెంకటరత్నరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోడాబత్తుల చంటి, నక్కా ఆనంద్‌కుమార్, యాళ్ల సురేష్, నక్కా యేషయ్య, పాముల నాని, పల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



దుళ్లలో సామూహిక సీమంతాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

కడియం: ఐసీడీఎస్ పోషణా మాసోత్సవాల్లో భాగంగా దుళ్లలో సామూహిక సీమంతాలను శనివారం నిర్వహించారు. అక్కడి ఎర్రకాలనీలోని నాలుగో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. నాయకులు వట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ అన్నారు. వీరవరం సెక్టార్ 14వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని కడియపులంక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఏసీడీపీవో కనకవల్లి, సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

నవరాత్ర మహోత్సవాలకు శ్రీకారం



గణపతి నవరాత్ర మహోత్సవాలను ప్రారంభిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని శ్రీవల్లభ గణపతి మందిరంలో పంచదశ గణపతి సమేత శ్రీవల్లభ గణపతి స్వామివారి నవరాత్ర మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాచస్పతి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ చేతుల మీదుగా ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక పూజలతో పాటు, సాయంత్రం 4 గంటల నుంచి వివిధ హారతులు, పల్లకీ సేవ, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు మందిర్ నిర్వహణ కమిటీ తెలిపింది.

22న 5కే రన్

ప్రకాశంనగర్: ఎయిడ్స్‌పై అవగాహన పెంచడానికే యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎస్.వసుంధర శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22న నగరంలో 5కే రన్ నిర్వహిస్తామన్నారు. అలాగే డ్రామా, రీల్ మేకింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడంతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

బీసీల ఆత్మీయ మహాసభకు తరలిరండి



వేమగిరిలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కడియం: త్వరలో జరగనున్న బీసీల ఆత్మీయ మహాసభకు భారీఎత్తున తరలిరావాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ కోరారు. శనివారం ఆయన మండలంలోని వేమగిరి, వీరవరం తదితర గ్రామాల్లో నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మహాసభ ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ సభ విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలన్నారు. ఆయా గ్రామాల నాయకులు వాసంశెట్టి గోదావరి, గుబ్బల శ్రీనివాసు, నరాల గణపతి, పితాని హరికృష్ణ, యనమదల మణికంఠ, నరాల శ్రీను, పితాని శ్రీను, కట్టా శ్రీధర్, బొక్క శ్రీను, మట్టపర్తి వెంకన్న, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వీరవరంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య తదితరులు హాజరయ్యారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కొబ్బరి రైతులు

ప్రకాశంనగర్: కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఉద్యమం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతు సంఘ రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. శనివారం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈ సంఘ రాష్ట్ర సదస్సు జరిగింది. ముందుగా మొలకలు వచ్చిన కొబ్బరికాయలతో అంబేడ్కర్ భవనం నుంచి గోకవరం బస్టాండ్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొబ్బరి రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కొబ్బరి ఉత్పాదకతలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నా ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్లతో దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. రైతు సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరిని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని, ఒక్కో కాయకు కనీస ధర రూ.15 ఇవ్వాలన్నారు. సదస్సుకు కొబ్బరి రైతు సంఘం నాయకుడు బొల్లి రామకృష్ణ అధ్యక్షత వహించగా, సంఘ నాయకులు తెప్పల అజయ్‌కుమార్, ఆకుల హరేరామ్, అప్పారావు, కంకటాల బుద్ధుడు, తూటే మార్టిన్ లూథర్, గుడిబండి వీరారెడ్డి మాట్లాడారు.

సిఫార్సులను అమలు చేయాలి

ప్రకాశంనగర్: కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తాడితోట సంహిత ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 20వ మహాసభ తోట లక్ష్మణ్‌రావు అధ్యక్షతన జరిగింది. ఆవుల శేఖర్ మాట్లాడుతూ 25 నుంచి 27 వరకు బాపట్లలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, పార్టీ నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, ప్రజా సంఘాల నాయకుడు నల్ల రామారావు పాల్గొన్నారు.

బీమా పరిహారం పంపిణీ

కడియం: దుళ్లలో డి.శ్రీను ఆకస్మికంగా మృతి చెందగా వైఎస్సార్ బీమా పరిహారాన్ని అతని కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు సింగం లక్ష్మి, నాయకుడు అయిల సుబ్బారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం నిలిపివేత

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డుపై ప్రహరీ నిర్మిస్తున్నారంటూ స్థానికుల ఫిర్యాదుతో అధికారులు ఆ పనులను నిలుపుదల చేయించారు. కాతేరు పంచాయతీ పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వీధిలో మేకా సుబ్రహ్మణ్యం తదితరులు రోడ్డుపై ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు గోతులు తీయడంతో స్థానికులు ఇటీవల జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సర్వే చేసేవరకూ నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేసినా రోడ్డుపై వారం రోజులుగా పనులను చేపడుతున్నారు. స్థానికులు శనివారం తిరిగి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని పనులను నిలుపుదల చేయించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ ప్రహరీ పనులను నిలుపుదల చేశామని, సర్వేయర్లతో పూర్తిస్థాయిలో సర్వే చేయించి తగు చర్యలు చేపడతామన్నారు.